క్లుప్తంగా

కాంగ్రెస్ శ్రేణుల ఇంటింటి ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి గ్రామంలో ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చేపడుతున్న కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి స్పందన వస్తోందని తెలిపారు.

మహిళ అదృశ్యం



తహేరాబేగం

సంగారెడ్డి: మహిళ అదృశ్యమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన తాహేరాబేగం (60) ఈ నెల 12న సాయంత్రం 4గంటలకు సదాశివపేటలోని మహబూబ్ పాషా దర్గాకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సయ్యద్ ఖలీల్ తన తల్లి ఆచూకీ కోసం తండ్రి ఖాజాతో కలిసి దర్గా, మసీదుల వద్ద ఎంత వెతికినా కనిపించకపోవడంతో 16న సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 08455–276333, 8712656718 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ సూచనలతో న్యాయసేవాధికార సంస్థ తరుపున ఉచితంగా న్యాయసేవలు అందించుటకు వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి హన్మంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు న్యాయ సలహాలు, అవగాహన కల్పించుటకు ఉచిత న్యాయ సహాయం చేయుటకు ఔత్సాహికుల నుంచి ఈ నెల 18 నుంచి 31 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్లతో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం, జిల్లా కోర్టులో సమర్పించాలని సూచించారు.

రసాయన పరిశ్రమల్లో అపార అవకాశాలు

పటాన్‌చెరు టౌన్: తగిన నైపుణ్యాలతో విద్యార్హత సాధించిన వారికి రసాయన పరిశ్రమల్లో అపార అవకాశాలు ఉన్నాయని చైనాలోని జెజియాంగ్ శరణ్ కెమికల్ టెక్నాలజీ ముఖ్య కార్య నిర్వహణాధికారి, అధ్యక్షుడు డాక్టర్ శరణ్ బస్సప్ప అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో (జీఎస్పీ) రసాయనశాస్త్రం, రసాయన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై మంగళవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కెమిస్ట్రీ ఉద్యోగాలు ల్యాబ్ ఆధారితమైనప్పటికీ, ఫీల్డ్‌వర్క్ ఆఫీసు వర్క్, విద్యాబోధన వంటి అవకాశాలు కూడా ఉన్నాయని, ఆయా ఉద్యోగాలకు తగిన అర్హత (బ్యాచిలర్ డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు) కలిగి ఉండాలన్నారు. ఐపీఏ తెలంగాణ ఇన్‌చార్జి సాయినాథ్ జ్యోతి, ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివకుమార్, సమన్వయకర్త డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాగడా గుర్తుకే ఓటేయండి


పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమలో ఈ నెల 19న జరిగే కార్మిక సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ (శాండ్విక్ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్) కాగడా గుర్తుకు ఓటేసి గెలిపించాలని హెచ్ఎంఎస్ జాతీయ నాయకులు సుదర్శన్‌రావు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. మెరుగైన వేతన ఒప్పందం కోసం హెచ్ఎంఎస్ పోరాటం చేస్తోందన్నారు. శాండ్విక్ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్, యూనియన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ హుండీని మంగళవారం లెక్కించారు. దేవాదాయశాఖ ఏసీ శివరాజ్, ఈఓ శశిధర్‌గుప్తా, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, నిర్వాహకులు సోమయ్య ఆధ్వర్యంలో స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.19.90లక్షల ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానిక కలర్ స్కూల్ పక్కన సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి తెలిపారు. అతడి వయసు 30–35 సంవత్సరాల మధ్య ఉంటుందని, నీలం రంగు షర్టు, తెల్లని బనియన్, బూడిద రంగు ప్యాంటు ఒంటిపై ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని వివరాలకు సీఐ ఫోన్: 8712656721 చేసి సంప్రదించాలని ఆయన కోరారు.



సంగారెడ్డి: అన్నపూర్ణగా అమ్మవారు



జిన్నారం: అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



రామచంద్రాపురం: అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ సింధురెడ్డి, తదితరులు



మునిపల్లి: అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



పటాన్‌చెరుటౌన్‌లో...

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



ఝరాసంగం(జహీరాబాద్): కేతకిలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భద్రకాళీ అమ్మవారు మంగళవారం అన్నపూర్ణగా దర్శనమిచ్చింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలో ఆయా కాలనీలలో ప్రతిష్ఠించిన అమ్మవారికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ సింధురెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు – సంగారెడ్డి న్యూస్ డెస్క్



సదాశివపేట పట్టణం: సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికే మా మద్దతు

- పటాన్‌చెరు పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఏకగ్రీవ తీర్మానం



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు

పటాన్‌చెరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఏకగ్రీవ తీర్మానం చేసింది. పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు హెయిర్ సెలూన్లకు ప్రతినెలా ఉచితంగా 250 యూనిట్లు విద్యుత్ అందిస్తోందన్నారు. దీంతో పాటు బీసీ బంధు పథకం ద్వారా అర్హులైన వారందరికీ స్వయంఉపాధి కోసం ఎలాంటి షరతులు లేకుండా రూ.లక్ష సాయం అందిస్తోందని వివరించారు. తనకు నాయీ బ్రాహ్మణ కుటుంబాలు ఏకగ్రీవంగా మద్దతు తెలపడంపై కృతజ్ఞతలు తెలిపారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు శ్యామ్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, నారాయణ, చంద్రయ్య, నర్సింగరావు, వెంకటేష్, నిరంజన్, దినేష్ కుమార్, విష్ణు, పద్మనాభం, శివ పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులతో విజయం సాధిస్తా

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్



చింతా ప్రభాకర్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

సదాశివపేట(సంగారెడ్డి): గండిమైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తానని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీఫాం తీసుకున్న సందర్భంగా పట్టణంలోని గడిమైసమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. 2023 బీఆర్ఎస్ మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ పిచర్యాగడి రేణుకాశివకుమార్, కోఆప్షన్ మెంబర్ కోడూరి అంజయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బుచ్చనగారి రామచంద్రారెడ్డిని మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీజేఆర్ యువసేన నాయకుడు షకీల్ అహ్మద్‌తో పాటు 20మంది యువకులు చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాధవరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు సుదీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, రమేష్, మాణిక్, నర్సింహులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు అండగా ఉండండి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



కాపు నాయకులతో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఐజీ కాలనీలో నివాసముండే రాష్ట్ర కాపు సంఘం నాయకులు అరవ రామకృష్ణ నివాసంలో పలువురు కాపు సంఘం నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కాపు భవనం కోసం నగరంలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా ప్రత్యేక నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఎన్నికల్లో కాపు సామాజికవర్గం బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కాపు సంఘం ప్రముఖులు భగవాన్, నాగ మోహన్‌రావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

సదాశివపేట(సంగారెడ్డి): మనబీస్ పౌండేషన్ చైర్మన్ ముఖీం ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి పట్టణంలోని కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మనబీస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని టీజేఏసీ జిల్లా చైర్మన్ కొత్తగొల్ల సత్తయ్య యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్‌కు ఖురేషీల మద్దతు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ ఖురేషీలు మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మైనొద్దీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకోసం కృషిచేస్తామని తెలిపారు. ఖేడ్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గెలవాలని పూజలు



బీరప్ప ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మూడో పర్యాయం గెలవాలని కోరుకుంటూ ఖేడ్ నియోజకవర్గంలోని కురుమ సంఘ నాయకులు మహారాష్ట్రలోని తుల్జాపూర్ తుల్జాభవానీమాత, ఉమర్గాలోని బీరప్ప ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కురుమ సంఘ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నవనాథ్, ఖేడ్ మండల ఉపాధ్యక్షుడు దత్తు తదితరులు పాల్గొన్నారు.

12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ ఆంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని వైద్యులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 8 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

'కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు'



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో కాటా శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని ఆ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల మండలంలోని రాంరెడ్డిబావి గ్రామ ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రవీందర్‌రెడ్డి, వార్డుసభ్యులు శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు 50 మందికి పైగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్‌రావు, నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. రామచంద్రాపురం పట్టణంలోని అమర ల్యాబ్స్‌లో ఇటీవల యాజమాన్యం నిర్లక్ష్యంతో ప్రమాదం చోటుచేసుకోవడంతో చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన పదార్థాలకు తగిన వెంటిలేషన్ లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిశ్రమల్లో తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, సత్తయ్య, నరసింహ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉజ్వల కళాశాలలో బతుకమ్మ సంబరాలు



ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఉజ్వల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు బతుకమ్మ సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రఘువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ వెంకటేశం, అధ్యాపకులు సునీత, వరలక్ష్మి, ప్రియాంక, సంధ్య, వినయ్, చంద్రశేఖర్, నర్సింహులు, రాజు, శ్రీకాంత్, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం కటకట



మిర్జాపూర్ (ఎన్) లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న సిబ్బంది

- సక్రమంగా సరఫరాకాని మిషన్ భగీరథ నీరు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పుష్కలంగా నీరున్నా అధికారులు నిర్లక్ష్యంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దసరా పండుగను పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సమయంలో ఇండ్లను శుభ్రం చేసుకోవడంతో పాటు ఇతర అవసరాల కోసం నీరు కావాల్సి ఉంటుంది. కానీ.. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు.

మండలంలోని మిర్జాపూర్ ఎన్, టేకూరు, హుస్సేన్‌నగర్, తదితర గ్రామాలకు చాల్కి ఫిల్టర్ బెడ్ వద్ద (మంజీర నది) ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ తాగునీటి కేంద్రం ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అయితే కొన్ని రోజుల నుంచి గ్రామాలకు నీటి సరఫరా కావడంలేదు. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.

తప్పని తిప్పలు

మిషన్ భగీరథ నీరు అందుబాటులోకి వచ్చినా సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని, తాగునీరు అందించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు సరఫరా అయ్యేవిధంగా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఎస్ఈని వివరణ కోరగా మోటార్లు కాలిపోవడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయని, మూడు రోజుల్లో వాటికి మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

నవరత్నాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- ఎస్ఎంఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్



మహిళలతో మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

జిన్నారం(పటాన్‌చెరు): తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశారని ఇప్పుడు నవరత్నాలను ప్రకటిస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఎస్ఎంఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ప్రశ్నించారు. గుమ్మడిదల మండలంలోని మంబాపూర్, గుమ్మడిదల గ్రామాల్లో ×మీ కొడుకు మీ గుమ్మంలో₹ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండో రోజు పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేసిందేమీలేదని, మేనిఫెస్టోలో నవరత్నాలు జోడించి నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు బీఆర్ఎస్ నేతలు యత్నిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో తాను చేస్తున్న పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందనను చూసి బీఆర్ఎస్ నేతలు తట్టుకోవటం లేదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే కన్న కొడుకులా అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎస్ఎంఆర్ యువసేన నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ఓ వ్యక్తి మృతి చెందడంతో దహన సంస్కారాల కోసం పీఎస్ ఫౌండేషన్ చైర్మన్ బూరుగడ్డ రాకేష్‌రాజ్ తన వంతు సహాయంగా రూ.5వేల ఆర్థికసాయాన్ని మంగళవారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తమ ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు.